క్లుప్తంగా

పులిపాడు శివాలయంలో జిల్లా జడ్జి పూజలు



పూజలు చేస్తున్న జిల్లా ఒకటో అదనపు జడ్జి శివకుమార్, జడ్జి సరస్వతి

ముండ్లమూరు: మండలంలోని పులిపాడు వద్ద గంగా అన్నపూర్ణ, పూర్ణేశ్వరస్వామి శివాలయంలో జిల్లా ఒకటో అదనపు జడ్జి ఆర్ శివకుమార్ శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ పూజారి రాజుశర్మలు జడ్జికి మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద స్వామివారికి మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయంలో వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి నూతన వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. దర్శి జూనియర్ సివిల్ జడ్జి జీవీఎల్ సరస్వతి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారి వెంట కోర్టు సిబ్బంది ఉన్నారు.

8న విద్యా సంస్థలు బంద్

గిద్దలూరు రూరల్: విద్యా సంస్థలు ఈ నెల 8వ తేదీన బంద్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు నారాయణ, వినోద్‌లు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, ప్రకాశం జిల్లా యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలని కోరుతూ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మార్కాపురం: పట్టణంలోని గుండ్లకమ్మ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సబ్ ఇంజినీర్ సుబ్బరాయుడు తెలిపారు. 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఇంజినీరింగ్ కళాశాలలు, దరిమడుగు, దేవరాజుగట్టు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలి

పుల్లలచెరువు: రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈవో శామూల్యజాన్ అన్నారు. మండలంలోని ఐటి వరం గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు తనిఖీ చేసి అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యావ్యవస్థలో తీసుకొస్తున్న మార్పులకు అనుగుణంగా బోధన చేయాలన్నారు. ఉపాధ్యాయులకు ప్రభుత్వం ద్వారా ఇచ్చే శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు తెలియజేస్తూ వారిలో సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈయన వెంట హెచ్ఎం పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

కంభం: అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి సభ్యుడు ప్రయత్నించాలన్నారు. ప్రధానంగా నీటి సమస్య, శానిటేషన్ వంటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా చిన్న కంభం సర్పంచి రసూల్ మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రజా సమస్యలపై స్పందించడం లేదని ఆరోపించారు. ఎంపీడీఓ ప్రసాద్‌బాబు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

గిద్దలూరు రూరల్: అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీపీ కడప లక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో సమస్యలను పరిష్కరించే దిశగా అందరం కలిసికట్టుగా ప్రయత్నించాలన్నారు. ప్రధానంగా నీరు, శానిటేషన్ వంటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ హేమలత, ఈఓఆర్డీ చెన్నారావు, మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

వరిలో ఉల్లికోడు నివారణ చర్యలు చేపట్టాలి

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలో వరి సాగు చేసిన రైతులు ఉల్లికోడు తెగులుపై అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. క్షేత్ర పర్యటనలో భాగంగా శనివారం తురకపాలెం, రమణాలవారిపాలెం లో వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 3785 ఎకరాల్లో వరి సాగుచేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వరిలో ఉల్లికోడు తెగులు ఉందన్నారు. దాని నివారణకు ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు 16 కేజీలు లేదా ఫోరేట్ 10జి గుళికలు ఐదు కేజీలు చల్లాలన్నారు. ఆయన వెంట వీఏఏ నవీన్, రైతులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను వినియోగించుకోవాలి

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

గిద్దలూరు రూరల్: జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కోటగడ్డ వీధి యూపీఎస్సీ వైద్యశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే అన్నా రాంబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం తమ బాధ్యతగా భావించి జగనన్న ఆరోగ్య సురక్షను ప్రారంభించిందన్నారు. ఆరోగ్యం బాగాలేని వారి వద్దకు వెళ్లి ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి గతంలో ఏ ప్రభుత్వంలోనూ జరగలేదని గుర్తించాలన్నారు. వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ప్రజల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకునేందుకు ఇంటింటా తిరుగుతూ వారి ఆరోగ్య వివరాలు సేకరించి అనారోగ్యానికి గురైన వారిని గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందన్నారు. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా స్థానికులకు వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే అన్నా రాంబాబు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, కమిషనర్ వై.రామకృష్ణయ్య, తహసీల్దార్ డి.సీతా రామయ్య, వైస్ చైర్మన్లు ఆర్‌డీ రామకృష్ణ, కాతా దీపికా, కౌన్సిలర్లు, జేసీఎస్ కన్వీనర్లు, డాక్టర్ షరీఫ్ పాల్గొన్నారు.

మంచినీటి నివారణకు చర్యలు తీసుకోవాలి

● మాజీ ఎమ్మెల్యే ఉడుముల



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల

కొనకనమిట్ల: తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో మార్కాపురం డివిజన్‌లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కరువు ప్రాంతంగా ప్రభుత్వం గుర్తించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి కోరారు. ఆయన శనివారం మండల పార్టీ నాయకులతో కలిసి కొనకనమిట్లలో విలేకరుల సమావేశంలో పలు విషయాలు వెల్లడించారు. మార్కాపురంం నియోజకవర్గంలో రెండు నెలలుగా సరైన వర్షాలు లేనందున మంచినీటి ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొంటున్నారని, మంచి నీటి ఎద్దడిని నివారించేందుకు జిల్లా ఉన్నతాధికారులు చొరవ చూపాలన్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగు చేసిన పలు రకాల పంటలు ఎండుముఖం పట్టాయని, రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని, రైతులును ఆదుకొనేందుకు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని కోరుతూ శుక్రవారం కొనకనమిట్లలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు జిల్లా ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేశారని గుర్తు చేశారు. కంది, పత్తి, మినుము, అలసంద పంటలతో పాటు పలు రకాల కూరగాయల పంటలు ఎండుముఖం పట్టాయన్నారు. మండల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రజలను అన్నీ విధాలా ఆదుకోవాలని ఉడుముల కోరారు. సమావేశంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు ఉన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అరుణ, పక్కన ఎంపీడీఓ చందన

మార్కాపురం రూరల్: ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేయాలని ఎంపీపీ పోరెడ్డి అరుణా చెంచిరెడి, ఎంపీడీఓ చందన స్పష్టం చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ అరుణ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని కోరారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని చెప్పారు. నూతన సచివాలయ వ్యవస్థలో భాగంగా నిర్మాణ దశలో ఉన్న సచివాలయాలను, ఆర్‌బీకేలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టామని వివరించారు. పారిశుధ్య సమస్యలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, అంటురోగాలు ప్రబలకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని పెంచుకోవాలి

మార్కాపురం టౌన్: విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని డాక్టర్ సామ్యూల్ జార్జి ఫార్మసీ కళాశాల కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. కళాశాలలో నాందీ ఫౌండేషన్, మహీంద్ర ప్రైడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్ ప్రోగ్రాం శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థికి కమ్యూనికేషన్ స్కిల్స్, గ్రూప్ డిస్కషన్, రెజ్యూమ్ ప్రిపరేషన్, ఇంటర్వ్యూ ఫేసింగ్, బాడీ లాంగ్వేజ్, క్రిటికల్ థింకింగ్, ఎమోషనల్ ఇంటలిజెన్స్‌పై అవగాహన ఉండాలన్నారు. ఇవి నేర్చుకుంటే విద్యార్థుల ప్రగతికి ఉపయోగపడుతుందన్నారు. ట్రైనర్ జి. నరసింహారావు, ట్రైనర్ డాక్టర్ వై.రాజాజయరావు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

● డీఆర్‌డీఏ పీడీ రవికుమార్



యూనిట్లను పరిశీలిస్తున్న పీడీ రవికుమార్

కొనకనమిట్ల: మహిళలు అన్నీ రంగాల్లో ముందుండాలని, ప్రభుత్వం వారికి అన్నీ విధాలా ఆర్థిక చేయూత ఇస్తోందని వైఎస్సార్ క్రాంతి పథం ప్రాజెక్టు డైరెక్టర్ తేళ్ల రవికుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని చినమనగుండంలో పీఎం ఫుడ్ ప్రాసెసింగ్ ప్రోగ్రాం ద్వారా ఏర్పాటు చేయనున్న సుస్థిర జీవనోపాధుల యూనిట్లను ఆయన పరిశీలించారు. వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో బూంది మిక్సర్, పచ్చళ్ల తయారీ, చిక్కీ యూనిట్లకు రూ.21 లక్షల నిధులు బ్యాంక్ లింకేజీ ద్వారా ఇవ్వడంతో మహిళా సంఘాలకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగి ఆర్థికంగా ఎదిగేందుకు పెద్దపెద్ద యూనిట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పెట్టుకున్న పథకం ద్వారా మరికొంత మందికి ఉపాధి చూపవచ్చన్నారు. యూనిట్ల నిర్వాహకులైన గుత్తా భాగ్యలక్ష్మి, ఎం.రమణమ్మ, జి.సుబ్బులు ముందుకు రావటం అభినందనీయమన్నారు. డీపీఎం లవ్లీవుడ్ డేవిడ్, ఏరియా కో ఆర్డినేటర్ సుధాకర్, బ్యాంక్ లింకేజీ యాంకర్ పర్సన్ సుబ్బారావు, ఐబీడీపీఎం కృపారావు, ఏపీఎం కర్నాటి గోపాలకృష్ణారెడ్డి, సీసీలు యగ్రా, రామయ్య, రాజయ్య, వీఓఏలు, పొదుపు గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

మానవత సంస్థకు విరాళాలు

పొదిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు ఆ సంస్థ డైరెక్టర్లు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, డాక్టర్ యర్రం వెంకటేశ్వరరెడ్డిలు ఫ్రీజర్ బాక్సుల కోసం విరాళాలు అందజేశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో వారు విరాళాలను సంస్థ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు, కమిటీ సభ్యులు మువ్వల పార్థసారధి, కల్లం సుబ్బారెడ్డి, కె.యల్లమందారెడ్డి, బండి అశోక్, టి.వెంకటరావు, కాటూరి వెంకట నారాయణబాబు, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, జీసీ సుబ్బారావు, బి.సుమంత్, సామంతపూడి నాగేశ్వరరావు, యక్కలి శేషగిరిరావు, షేక్ బాజీ, జి.శ్రీను పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజలో వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

కురిచేడు: మండలంలోని పడమర గంగవరం పంచాయతీ పరిధిలో వేంచేసి ఉన్న వేణుగోపాల స్వామి విగ్రహ, కలశ, జీవధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురాతన కాలం నాటి ఆలయం జీర్ణావస్థకు చేరటంతో ఆలయ జీర్ణోద్ధరణ చేసి మూడు రోజులుగా నూతన విగ్రహ, కలశ, యంత్ర, జీవధ్వజ ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే డా బూచేపల్లి శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారికి గ్రామ సర్పంచ్ కాసు భాస్కరరెడ్డి, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, ధనిరెడ్డి వెంకటరెడ్డి, గోగులముడి లింగారెడ్డి, ఎంపీటీసీ అన్నెం అరుణ, మాజీ జెడ్పీటీసీ వరికూటి వెంకటేశ్వర్లు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వేణుగోపాలస్వామికి పూజలు చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి

ఘనంగా రామాలయ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ

దొనకొండ: మండలంలోని బాదాపురం గ్రామంలో గ్రామస్తులు ఐక్యతగా రామాలయం నిర్మించుకున్నారు. రెండు రోజులు హోమం, పూజలు చేసి శనివారం విగ్రహ, ధ్వజస్తంభం ప్రతిష్ఠ చేశారు. సీతా రాములు, లక్ష్మణుడు, జీవ ధ్వజ స్తంభం, గ్రామ దేవతల ప్రతిష్ఠ కార్యక్రమం బద్వేలుకు చెందిన ఓరగంటి సీతారామశాస్త్రి బృందం వేద మంత్రాలతో వైభవంగా నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నవ ధాన్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేశారు. జిల్లా చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట మండల మాజీ కన్వీనర్ కాకర్ల క్రిష్టారెడ్డి, కర్నాటి ప్రసన్నాంజనేయరెడ్డి, స్థానిక సర్పంచ్ కొంగలేటి గ్రేస్‌రత్నకుమారి దేవానంద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

57 మందికి వాకింగ్ స్టిక్స్

కురిచేడు: ఫ్లోరోసిస్ కంట్రోల్ ప్రోగ్రాం ద్వారా 57 మందికి వాకింగ్ స్టిక్స్‌ను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య చేతుల మీదుగా అందజేశారు. ఫ్లోరోసిస్ బారిన పడి, వృద్ధాప్యం కూడా తోడవటంతో తమ పనులు తాము చేసుకునేందుకు కర్రతోడు ఎంతో ఉపయోగపడుతుందని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా ప్రవీణ్, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అన్యాక్రాంతమైన పైపులు అప్పగించాలి

బేస్తవారిపేట: అన్యాక్రాంతమైన పైపులను పది రోజుల్లో మండల పరిషత్‌కు అప్పగించాలని ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏడేళ్ల క్రితం మండలానికి మంజూరైన 1200 పీవీసీ పైపులు, రెయిన్‌గన్స్, ఎనిమిది ఆయిల్ ఇంజిన్లు రైతుల నుంచి రికవరీ చేయక పోవడంపై ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పలుమార్లు సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించినా పట్టించుకోలేదు. సమావేశానికి గిద్దలూరు వ్యవసాయశాఖ ఏడీఏ బాలాజీనాయక్ హాజరయ్యారు. ఆ సమయంలో బేస్తవారిపేట ఏఓ కార్యాలయంలో పనిచేసిన ఏఈఓలతో రికార్డు తీసుకొచ్చారు. 300 పైపులు, ఆయిల్ ఇంజిన్లు, స్ప్రింక్లర్లు ఉన్న రైతుల పేర్లను సమావేశంలో చదివి వినిపించారు. వీరి నుంచి వారం రోజుల్లో రికవరీ చేస్తామని సభకు తెలిపారు. గ్రామ సచివాలయం పరిధిలోని జూనియర్ లైన్‌మన్‌లు సక్రమంగా పనిచేయడం లేదని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధి దీపాలు 24 గంటలూ వెలుగుతుండటంతో అధిక మొత్తంలో విద్యుత్ బిల్లులు వస్తున్నాయని సర్పంచ్‌లు తెలిపారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ తీగ పనిచేయక పోవడంతో టీవీలు, ఫ్యాన్‌లు కాలిపోతున్నాయని, హెచ్‌డీఎస్ విద్యుత్ తీగ అతుకులమయంగా ఉండటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీఓ సావిత్రి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మారెడ్డి

ముండ్లమూరు: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి బాధ్యతగా పని చేయాలని ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు సర్వసభ్య సమావేశాలకే సక్రమంగా హాజరుకాకపోతే ప్రజలకు ఏం సేవలందిస్తారని, వారి పనితీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. తహసీల్దార్ బాధ్యతలు చేపట్టాక ఒక్క సమావేశానికి కూడా హాజరుకాక పోవడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. మండల స్థాయి సమన్వయ సమావేశానికి రెవెన్యూ సిబ్బంది హాజరుకావడం లేదని ఎంపీడీఓ హనుమంతరావు తెలిపారు. సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని ఎంపీడీఓను ఎంపీపీ ఆదేశించారు. అనంతరం శాఖల వారీగా వారి సాధించిన ప్రగతి నివేదికలను వివరించారు. జెడ్పీటీసీ రత్నరాజు మాట్లాడుతూ స్థానిక ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆక్రమణలకు గురవుతోందని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా సర్వే చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసినా పట్టించుకోలేదన్నారు. ఏఓ ఫరూక్ మాట్లాడారు. ఎంఈఓ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సీడీపీఓ భారతి, ఏఈలు వెంకటేశ్వరరావు, మధుబాబు, హనుమంతరావు, డీటీ పుల్లారెడ్డి, ఏపీఓ మురళి, ప్రజాప్రతిధులు పాల్గొన్నారు.

శాంతకుమారి కుటుంబానికి బూచేపల్లి పరామర్శ



శాంతికుమారి భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దొనకొండ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించిన మురికిపూడి శాంతకుమారి అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి శాంతకుమారి కుటుంబాన్ని పరామర్శించి ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. వారి వెంట మాజీ కన్వీనర్ కాకర్ల క్రిష్టారెడ్డి, సచివాలయం మండల కన్వీనర్ గుంటు పోలయ్య, ఆదిమూలపు ప్రభుదాసు, కోఆప్షన్ సభ్యులు షేక్. గఫార్, కాలూరి రమణయ్య, దేవరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

అధికారులు నిష్పక్షపాతంగా పని చేయాలి

దర్శి: అధికారులు నిష్పక్షపాతంగా పని చేసి మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని డీఎస్పీ టి.అశోక్ వర్ధన్ సూచించారు. స్థానిక తాలూకా క్లబ్ సమావేశం హాలులో విజిలెన్స్ అవగాహన సదస్సు ఏసీబీ సీఐ అపర్ణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నీ శాఖలకు చెందిన అధికారులు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. అశోక్ వర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు నిబద్ధతతో సకాలంలో పని చేయాలన్నారు. చేసే పనుల్లో జాప్యాల వలన వినియోగదారులు కూడా పలు ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని చెప్పారు. అవినీతి రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. ఏసీబీసీఐ అపర్ణ మాట్లాడుతూ అధికారులు నిజాయతీ తో వ్యవహరిస్తే ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని చెప్పారు. కార్యక్రమంలో సీఐ జే రామకోటయ్య, విద్యుత్ ఏడీఈ పిచ్చయ్య, ఎంవీఐ రవికుమార్, డీటీ రవిశంకర్, ఎంఈఓ కాకర్ల రఘురామయ్య పాల్గొన్నారు.

టీటీడీ సహకారంతో 820 దేవాలయాల నిర్మాణం

పొదిలి: తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహకారంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో 820 దేవాలయాలు నిర్మించినట్లు ఎస్ఎస్ఎఫ్ నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రముఖ్ ఎస్.గోపాలరావు చెప్పారు. స్థానిక సాయి బాలాజీ కళ్యాణ మండపంలో శనివారం అర్చకులు, దేవాలయం కమిటీ సభ్యులు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో ధార్మిక చైతన్యం కోసం సంస్థ కృషి చేస్తోందన్నారు. దేవాలయం కేంద్రంగా బాల వికాస్ కేంద్రాల ద్వారా విద్యార్థుల్లో సంస్కారాల నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో ప్రకాశం జిల్లా కన్వీనర్ ఎస్వీ కృష్ణారావు, సహ కన్వీనర్లు ఎస్.తిరుపతిరెడ్డి, వెంకట్, ధర్మ ప్రచారకులు వెంగళరెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

బేస్తవారిపేట: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శని, ఆదివారం రోజుల్లో పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెలిగొండ ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట సుబ్బయ్య అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ బాలుర, బాలికల హైస్కూల్లో జరుగుతున్న ఓటరు నమోదును ఆయన తనిఖీ చేశారు. బూత్ లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో ఉండి ఓటరు నమోదుకు వచ్చే అప్లికేషన్‌లను బీఎల్ఓ యాప్‌లో వెంటనే నమోదు చేయాలన్నారు.

ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే అన్నా



ఆలయంలో పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పురాతన ఆలయం శ్రీపాతాళనాగేశ్వర స్వామి ఆలయంలో కొన్ని రోజులుగా కొనసాగుతున్న అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం లోపల భాగంలో నూతనంగా వేస్తున్న రాతిబండరాయి పరుపు పనులను పరిశీలించారు. పనుల్లో ఎటువంటి అవకతవకలు జరగకుండా నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ పనులు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట కౌన్సిలర్ బాలిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రమాదేవి, ఆంజనేయులు పాల్గొన్నారు.